

హరితహారంలో భాగంగా నెక్లెస్ రోడ్డులోని పీవీ మార్గ్‌లో ఉన్న గ్రీనరీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నది.

### నేడు లష్కర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, జనవరి 10 : విద్యుత్ మరమ్మతుల కారణంగా అడ్డగుట్ట, వసంతపురి సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సర్కిల్ విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

- అడ్డగుట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.
- గణేశ్ టెంపుల్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు
- సిరిపురి కాలనీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు
- షిప్‌పహాడ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

# పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 10 : తార్నాక డివిజన్ హనుమాన్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. పనుల నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం కాలనీ వాసులను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి, అధికారులు, హనుమాన్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# 'సైబర్ క్రైమ్స్' పై బస్తీల్లో అవగాహన



బస్తీల్లో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పిస్తున్న గాంధీనగర్ పోలీసులు

బన్సీలాల్‌పేట్, జనవరి 10 : మొబైల్ ఫోన్లలో వచ్చే మోసపూరిత ప్రకటనలు, లాటరీ వచ్చిందని, వడ్డీ లేకుండా లోన్ తీసుకోమంటూ డబ్బు ఆశ చూపించే లింక్‌లు, స్కానర్లను నమ్మవద్దని గాంధీనగర్ పోలీసులు హెచ్చరించారు. ఇటీవల పెరిగిన 'సైబర్ క్రైమ్స్' గురించి బోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలో బుధవారం స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ కే.నర్సింహ మాట్లాడుతూ.. తాము డబ్బు మోసపోయినట్లుగా గుర్తిస్తే వెంటనే 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. లేదా సమీప పీఎస్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని, ఈ రోజుల్లో వాటి అవసరం కూడా అంతే ముఖ్యమన్నారు. కనీస అవగాహన లేకుంటే తమ బ్యాంకు ఖాతాల నుంచి సొమ్మును మోసగాళ్లు కొట్టేస్తారని, అందుకే యూపీఐ యాప్‌లు వాడకంపై, బ్యాంకు లావాదేవిల గురించి తెలుసుకోవాలని ఆయన అన్నారు. వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వివరాలు, ఆధార్, పాన్, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి చెప్పవద్దని ఆయన సూచించారు.

# శానిటేషన్ సిబ్బందికి రక్షణ కిట్లు పంపిణీ

సికింద్రాబాద్, జనవరి 10: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే .. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారికి రక్షణ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం హెల్త్ కిట్లను అందజేశామన్నారు. అదేవిధంగా ప్రజలు కూడా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకట రమణ, ఎస్‌ఎఫ్‌ఐ, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమ



**పల్లె బాట ..** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నగర వాసులు పల్లెబాట పట్టారు. బుధవారం జేబీఎస్ ప్రయాణికులతో సందడిగా కనిపించింది.



## క్రిస్మస్ కానుకలు పంపిణీ

మెట్టుగూడ విజయపురి కాలనీలోని బాప్టిస్ట్ చర్చిలో బుధవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణుమాధవ్ మహిళలకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు వై.పురుషోత్తం, కార్యదర్శి నవీన్ విక్టర్, కోశాధికారి ఏసుపాదం, పి.అజరయ్య, మోజెస్, వి.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. **- అడ్డగుట్ట, జనవరి 10**

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

## మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బొల్లారం,జనవరి 10: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ పిల్లలు పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు.బుధవారం బోయిన్‌పల్లిలోని సీఎంఆర్ పాఠశాలలో (హెన్‌చెంట్–2024) పేరుతో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,విద్యాలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు పాండు యాదవ్,డైరెక్టర్ ఎస్‌కే.రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేశ్వరి,ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో చైర్మన్ గోపాల్‌రెడ్డి



బోయిగూడ కళారంగ్ కాలనీలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

# సకాలంలో టీకాలు వేయించాలి

బన్సీలాల్‌పేట్, జనవరి 10 : న్యూబోయిగూడలోని కళారంగ్ కాలనీలో బుధవారం గాంధీ దవాఖాన పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులకు టీకాలు వేశారు. చిన్న పిల్లలకు టీకాలు వేయడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచి, రోగాలు రాకుండా చిన్నారులకు రక్షణ కవచంలాగా పనిచేస్తాయని పీహెచ్‌ఎన్ సత్తమ్మ, ఎన్‌ఎం జీనత్ తెలిపారు. అదే విధంగా టీకాలను సకాలంలో వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ శిబిరంలో ఆశ వర్కర్లు సుశీల, మహేశ్వరి, బస్తీ నాయకులు పాల్గొన్నారు.


# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బొల్లారం, జనవరి 10 : బస్తీలో నివసించే పేద ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు బోయిన్‌పల్లి వీఆర్ ఆస్పత్రి ఎండీ నంద కిశోర్ అన్నారు.బుధవారం డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో వీర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, దంత, జనరల్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బీఎమ్ రావు, వైద్య సిబ్బంది, నాయకులు ,ఆనంద్, గోపాల్, వెంకటేశ్, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నోట్ పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జనవరి 10 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.సి.సుంకి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమయపాలన క్రమశిక్షణ పాటించాలన్నారు. అదే విధంగా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ సుధాకర్, లయన్ డిమ్మి, లయన్ రఘువర్మ, పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

### అసమానతలు తొలగించేందుకే..

## ఎస్సీ వర్గీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 10 : అసమానతలు తొలగించేందుకే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ కోరారు. మాదిగ విద్యార్థుల సదస్సును ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్‌తో కలిసి గోవిందు నరేశ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు అందిస్తాం

చిక్కడపల్లి, జనవరి 10: కార్మికులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానని కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం కృష్ణ ఆదిత్య బాధ్యతలను స్వీకరించారు.

# 'పాత పెన్షన్'నే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య

అడ్డగుట్ట / మారేడ్‌పల్లి, జనవరి 10 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మెట్టుగూడలోని సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాపు బ్రాంచ్ ఆధ్వర్యంలో కొత్త పెన్షన్‌ను కాకుండా పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శంకర్‌రావు మాట్లాడుతూ... పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమాన్ని సాగిస్తామన్నారు. దేశవ్యాప్తంగా పాత పెన్షన్ కోసం ప్రాంతాల వారీగా సభలు ఏర్పాటు చేసి ఉద్యోగులను చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాపు బ్రాంచ్ సెక్రటరీ నరేందర్ సేత్, చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపెన్షన్ విధానంతో నష్టం..**

రైల్వేలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సంచాలన్ భవన్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం మర్రి రాఘవయ్య మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, కార్మికులపై పని భారం పడకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలతో పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని దీంతో ఎంతో మంది రైల్వే ఉద్యోగులకు నష్టం కలుగుతుందన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జనవరి 10 : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పుర రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

## వేర్వేరు చోట్ల రెండు దుకాణాల్లో చోరీ

బేగంపేట్, జనవరి 10 : రాత్రి దుకాణాల షట్టర్లను తొలగించి రూ. 4 లక్షల నగదును దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ వ్యాపారి అశోక్‌కుమార్ గార్గా పేరుతో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా సోమవారం షాపు మూసి ఇంటికెళ్లాడు. మరుసటి రోజు వచ్చేసరికి షట్టరు తెరిచి కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో పెట్టిన నగదు కనిపించలేదు. దీంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రోహిత్ ఇంటర్నేషనల్ షాపులో కూడా షట్టర్‌ను తొలగించి కౌంటర్‌లో ఉన్న రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. ఇరు దుకాణాల యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. మహంకాళి ఏసీపీ రవీందర్ యాదవ్, ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్లు క్లూస్ టీం ను పిలిపించి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అక్షింతలు పంపిణీ చేస్తే.. కేసు పెడుతారా..!

బేగంపేట్ జనవరి 10 : గత నెల 29న శ్రీ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అయోధ్య అక్షింతల శోభాయాత్ర నిర్వాహకులపై మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకులు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కేసులో ఉన్న వారికి మార్కెట్ పోలీసులు 41 సీఆర్పీసీ కింద ఇచ్చిన నోటీసులకు బుధవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. అనంతరం మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక పార్టీ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ.. ట్రస్ట్ పిలుపు మేరకు డీజే సౌండ్‌ను తక్కువగా పెట్టుకొని తాము ర్యాలీ నిర్వహిస్తే మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి వారిపై పోలీసు ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హుండీ ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట్, జనవరి 10 అమీర్‌పేట్‌లోని హనుమాన్ దేవాలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 93 రోజులకు గాను రూ.6,53,905ల ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీదేవి తెలిపారు. ఈవో ఎం.విఠలయ్యతో పాటు దేవాలయ ఉద్యోగులు, అర్చకులు, భక్తులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

# కుట్టు మిషన్లు పంపిణీ



శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులు

అమీర్‌పేట్, జనవరి 10 : కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సనత్‌నగర్ చేతన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ జరిగింది. బుధవారం సనత్‌నగర్ జెక్ కాలనీలోని ఎస్‌వీఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ చౌదరి ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్స్ ఆవరణలో లయన్స్ క్లబ్ సహకారంతో 11 మంది మహిళలకు కుట్టు మిషన్లు,100 మంది అపార్ట్‌మెంట్ల కాపలాదారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంపత్ కుమార్, తిరుపతిరెడ్డి, మంగమూరి మాధవి, శేషగిరిరావు, ఎలీషా, రమణి, రషీద్, మాధవ్, గణేశ్ పాల్గొన్నారు.



అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది, ఆశవర్కర్లకు బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ హాజరై పోటీల్లో పాల్గొన్న వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయి శంకర్, ఆశ వర్కర్లు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **- అడ్డగుట్ట, జనవరి 10**